క్లుప్తంగా

30న మహా చండీహోమం


కనక దుర్గమ్మ అమ్మవారు

ఆకివీడు: స్థానిక జవహర్‌పేటలోని కనక దుర్గమ్మ ఆలయ ఆరో వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 30వ తేదీన మహాచండీ, దుర్గా సహిత రుద్రహోమం నిర్వహించనున్నారు. మూడు రోజుల పాటు జరిగే అమ్మవారి వార్షికోత్సవాల్లో 29వ తేదీన అమ్మవారికి మహిళలు బిందెలతో తీసుకొచ్చిన పసుపు నీళ్లతో జలాభిషేకం, 30న మహాచండీ, రుద్ర హోమం, 31వ తేదీన కుంకుమ పూజలు, అఖండ అన్నసమారాధన నిర్వహించనున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ తెలిపింది. కార్యక్రమాలను రోజూ ప్రత్యేక పూజలను బ్రహ్మశ్రీ గూడూరి రామభద్ర శివ కుమార్‌శర్మ (నాని) ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు.

పర్యాటక కేంద్రాల సందర్శన


అల్లూరి విగ్రహం వద్ద స్కౌట్ గైడ్స్ శిక్షణ విద్యార్థులు

భీమవరం: క్రమశిక్షణ, ఏకాగ్రత దేశభక్తికి స్కౌట్ ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ దోహదపడతాయని, జాతీయ భావాలను పెంపొందిస్తాయని ఆంధ్రప్రదేశ్ స్కౌట్ గైడ్స్ శిక్షణ ఎల్‌టీసి (అమరావతి) డీఎల్ నారాయణ అన్నారు. గత రోజులుగా భీమవరం బ్రౌనింగ్ జూనియర్ కళాశాలలో 192 మందికి స్కౌట్ గైడ్స్‌పై శిక్షణా శిబిరాన్ని నిర్వహించగా ఆదివారం పర్యాటక కేంద్రాలను సందర్శించారు. దీనిలో భాగంగా 125 అడుగుల విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు, మావుళ్లమ్మ అమ్మవారి దేవస్థానం, పెదఅమిరం జైన్ దేవాలయాలను సందర్శించారు. నారాయణ మాట్లాడుతూ స్కౌట్ బాల్యం నుంచి శిక్షణ పొందితే జీవిత గమనంలో ప్రతిభ పాటవాల్లో ముందుంటారని, దేశ వ్యాప్తంగా వేలాది పాఠశాలలో స్కౌట్ గైడ్స్ శిక్షణ పొంది సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారన్నారు. చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ నేను కూడా పాఠశాల విద్యార్థిగా స్కౌట్ గైడ్స్ శిక్షణ పొందానని, స్కౌట్‌తో సమన్వయ శాంతి స్వభావాలు కలుగుతాయన్నారు.

విద్యుత్ స్తంభాలను చుట్టేసిన పాదులు


విద్యుత్ స్తంభాలను చుట్టేసిన పిచ్చిపాదులు

ఆకివీడు: విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతారయం కల్గిస్తున్న పాదులు, పిచ్చి మొక్కల తొలగింపు నామ మాత్రంగానే ఉందని పలువురు ఆరోపిస్తున్నారు. పలు చోట్ల విద్యుత్ స్థంభాలు కన్పించకుండా పచ్చని పాదలతో నిండిపోయి ఉంటున్నాయి. ఏబీ స్విచ్‌లు, ట్రాన్స్‌ఫార్మర్లు, వైర్లు వెంబడి పాదులు పాకుతున్నా పట్టించుకునే నాథుడు లేడని పలువురు వాపోతున్నారు. ఇటీవల కాలంలో విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తూ మరమ్మతులు, ట్రీ కటింగ్ అంటూ గంటల తరబడి సరఫరా నిలిచిపోయినా పనులు ఎక్కడ జరుగుతున్నాయో తెలియని పరిస్థితి నెలకొంది. విద్యుత్ కోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. మండలంలోని పలు గ్రామాల్లోనూ పట్టణంలోని పలు వీధుల్లో ఉన్న ప్రధాన స్థంభాలకు పిచ్చి పాదులు ఎగబాకుతున్నాయి. కొబ్బరి ఆకులు, ఇతర చెట్ల కొమ్మలు కూడా విద్యుత్‌తీగలకు తగిలి ప్రమాద భరితంగా మారాయి. గత నెల రోజులుగా వారానికి రెండు, మూడు రోజుల పాటు మరమ్మతులు, ట్రీకటింగ్ పేరుతో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నారని వినియోగదారులు ఆవేదన చెందుతున్నారు. విద్యుత్ సరఫరా నిలుపుదలకు ప్రజలు సహకరిస్తున్నా, పనులు మాత్రం అంతంత మాత్రంగానే జరుగుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఉచిత మెగా వైద్యశిబిరం

పోడూరు: యునైటెడ్ కాపు వనిత సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పాలకొల్లు పట్టణంలోని న్యూబ్యాంక్ కాలనీ ఎస్‌ఎస్‌ఎస్ ఎలిమెంటరీ స్కూల్‌లో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. సంస్థ ఇంటర్నేషనల్ డైరెక్టర్ ముచ్చర్ల సంజయ్, గవర్నర్ పెనుమాక రామ్మోహన్ శిబిరాన్ని ప్రారంభించారు. రాజమండ్రి కిమ్స్ ఆసుపత్రి వైద్యులతో పాటు పట్టణంలోని ప్రముఖ వైద్యులు శిబిరంలో పాల్గొన్న రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వనిత క్లబ్ రీజనల్ చైర్‌పర్సన్ మంగిన అరుణ, ప్రెసిడెంట్ యామన విజయలక్ష్మి, సెక్రటరీ దేవరపు కాంచనమాల, ట్రెజరర్ సిద్ధిరెడ్డి శైలజ, విజయల్యాబ్ అధినేత కొమ్ముల మురళి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో స్పందన కరువు

- మండల, జిల్లా కేంద్రాలకు పరుగులు తీస్తున్న అర్జీదారులు
- ప్రజా సమస్యలపై కూటమి సర్కారు నిర్లక్ష్యం
- వైఎస్సార్‌సీపీ హయాంలో సచివాలయాల్లోనే అర్జీల స్వీకరణ


పెన్నాడ అగ్రహారం సచివాలయం

పాలకోడేరు: కూటమి ప్రభుత్వం సచివాలయాల్లో స్పందనకు చెల్లు చీటీ ఇచ్చింది. దీంతో అర్జీదారులు మండల, జిల్లా కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. ప్రజా సమస్యలపై కూటమి సర్కారు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో గ్రామీణ ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలకు సుపరిపాలన అందించాలనే లక్ష్యంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి రెండు వేల కుటుంబాలకు ఒక గ్రామ సచివాలయాన్ని ఏర్పాటు చేసింది. దీంతో ఉండి నియోజకవర్గంలోనే పాలకోడేరు మండలంలో 18, ఉండి మండలంలో 21, కాళ్ల మండలంలో 21 ఆకివీడు మండలంలో 16 సచివాలయాలు ఏర్పాటు చేశారు. ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు స్పందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. గ్రామ వార్డు సచివాలయాల పరిధిలో రోజూ మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు పంచాయతీ కార్యదర్శితో పాటు సచివాలయ అధికారులు స్పందనకు హాజరయ్యేవారు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ప్రతి గ్రామంలో వందలాది మందికి ఏ సమస్య ఉన్నా స్థానికంగా పరిష్కరించేవారు. దీంతో ప్రజలు మండల, జిల్లా స్థాయి స్పందనకు వెళ్లాల్సిన అవసరం ఉండేది కాదు.

కూటమి ప్రభుత్వం వచ్చాక..

ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్పందన కార్యక్రమానికి స్వస్తి పలికింది. దీనికి పేరు మార్చి మండల స్థాయిలో ప్రజా ఫిర్యాదులు పరిష్కార వేదిక నిర్వహిస్తుండడంతో ప్రజలకు మళ్లీ కష్టాలు మొదలయ్యాయి. ప్రజలు గ్రామాల నుంచి మండల కేంద్రానికి మండల కేంద్రంలో సరైన స్పందన లేకపోతే జిల్లా కలెక్టరేట్‌కు పరుగులు తీసి తమ సమస్యలు నివేదించుకోవాల్సి వస్తుంది.

తిష్ట వేస్తున్న సమస్యలు

గ్రామాల్లోని సమస్యలకు అధికారులకు నివేదించేందుకు మండల కేంద్రానికి వెళ్లాల్సి రావడంతో చాలా మంది సమస్యలను చెప్పుకోలేకపోతున్నారు. దీంతో ఆయా గ్రామాల్లోని సమస్యలు తిష్ట వేస్తున్నాయి. ప్రధానంగా భూ సమస్యలు, తాగు, సాగు నీరు, పింఛను, రేషన్ కార్డుల సమస్యలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వ పాలనలో మండల కేంద్రంలోనే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తుండడంతో వద్ధులు, మహిళలు దివ్యాంగులు వెళ్లలేకపోతున్నారు.

మహిళలు, వృద్ధులకు చాలా కష్టం



మండల కేంద్రంలో సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి దూర ప్రాంతాల నుంచి రావాలంటే మహిళలు, వృద్ధులు ఇబ్బంది పడుతున్నారు. రాను పోను బస్సు చార్జీలు పెట్టుకోవాల్సి వస్తుంది. ప్రజలకు ఇబ్బంది కలుగకుండా గ్రామస్థాయిలోనే ఈ కార్యక్రమం నిర్వహిస్తే అందరికీ ఉపయుక్తంగా ఉంటుంది.

-కురుకుంటి పాలు

స్పందన కొనసాగించాలి



ప్రజా సమస్యలను దృష్టిలో ఉంచుకొని వెంటనే సచివాలయాల్లో స్పందన(ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక) కార్యక్రమం నిర్వహించాలి. ఈ కార్యక్రమాన్ని నీరుగార్చకుండా అధికారులు గ్రామ స్థాయిలోనే సమస్యలను పరిష్కరించుకునేలా సచివాలయాల్లో ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేయాలి.

-బి.సుబ్రహ్మణ్యం, మోగల్లు

సచివాలయాల్లో స్పందన కౌంటర్ లేదు



గతంలో సచివాలయంలో ప్రతిరోజూ ఒక గంట పాటు సమస్యలపై అర్జీలు సేకరించేవారు. ప్రస్తుతం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో భాగంగా మండల కేంద్రంలో సమస్యలపై ఫిర్యాదులు స్వీకరిస్తున్నాం. అలాగే ప్రతి సోమవారం సచివాలయాల్లో కూడా సిబ్బంది అందుబాటులో ఉంటూ అర్జీలు తీసుకుని పరిష్కరించాలి. అందుబాటులో లేని సిబ్బందిపై చర్యలు తీసుకుంటాం.

-వి.రెడ్డియ్య, ఎంపీడీవో, పాలకోడేరు

విద్యుత్ భారాలను వెంటనే తగ్గించాలి



సమావేశంలో మాట్లాడుతున్న బలరాం

భీమవరం: ప్రజలపై కూటమి ప్రభుత్వం మోపిన విద్యుత్ భారాలను వెంటనే తగ్గించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం, మంతెన సీతారాం అన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మికులకు లేబర్ కోడ్లు కష్టజీవులకు అన్యాయం చేసే విధంగా ఉన్నాయని వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. టీడీపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఏవైతే వ్యతిరేకించిందో ట్రూఅప్ చార్జీలను, ఇంధన సర్దుబాటు చార్జీలను, స్మార్ట్ మీటర్లు, సెకి ఒప్పందాలు రద్దు చేయకుండా కొనసాగించడమంటే వారి అవినీతిలో కూటమికి భాగముందని బలరాం అన్నారు. దాళ్వా పంట కోతకు రాబోతుంది. క్వింటాళ్లకు రూ.3000 వేలు ఇవ్వాలని జిల్లా కమిటీ తరపున డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ఏమాత్రం సరిపోదు కేరళ, తమిళనాడు మాదరిగా మహారాష్ట్ర, కర్నాటక వలె బోనస్‌లు ప్రకటించి ఇవ్వాలని కోరారు. ఆక్వా రైతులు తీవ్ర సంక్షోభంలోఉన్నారన్నారు. కంపెనీలు సిండికేట్ అయ్యి ధరను తగ్గించి రైతులను నష్ట పరుస్తున్నాయన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించకపోతే రానున్న రోజుల్లో ఉద్యమాలను ఉద్ధృతం చేస్తామని బలరాం ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

గుర్రపుడెక్కతో నీటి ప్రవాహానికి ఆటంకం


గేదెలకోడులో పేరుకుపోయిన గుర్రపుడెక్క

ఆకివీడు: పంట, మురుగు కాలువలో గుర్రపు డెక్క విపరీతంగా పెరిగిపోయింది. పలు కాలువలో నీటి ప్రవాహానికి తీవ్ర అవరోధం కలిగిస్తున్నాయి. గుర్రపుడెక్కతో పాటు తూడు పేరుకుపోయింది. వెంకయ్య వయ్యేరు, ఓల్డ్ వయ్యేరు పంట కాలువలతో పాటు మైనర్, మీడియం పంట కాలువల్లో గుర్రపుడెక్క కిక్కిరిపోయింది. మండలంలోని చినకాపవరం డ్రెయిన్‌తో పాటు పలు మైనర్ డ్రెయిన్లలో గుర్రపుడెక్క పేరుకుపోయింది. గుమ్ములూరు వద్ద చినకాపవరం డ్రెయిన్‌లో ఏళ్ల తరబడి తూడు, గుర్రపుడెక్క పేరుకుపోవడంతో పచ్చగడ్డి మొలుస్తోంది. పచ్చగడ్డిని రైతులు కోసుకుంటున్నారు. దీనిపై పశువులు నడుస్తూ గడ్డి తింటున్నాయంటే, ఇక్కడ ఏ మేరకు మేట వేసి ఉందో స్పష్టమవుతోంది. వేసవిలో మెయింటినెన్స్ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ప్లాస్టిక్ నిర్మూలనకు కృషి చేద్దాం


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

ఉండి: ప్లాస్టిక్ నిర్మూలనకు ఐకమత్యంగా ముందుకు రావాలని విజయలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ నల్లా కిరణ్ ప్రసాద్ అన్నారు. ప్లాస్టిక్ వలన కలిగే అనర్థాలపై ప్రజలకు, దుకాణదారులకు అవగాహన కల్పిస్తూ ట్రస్ట్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ లేని నాటి సమాజం ఎంతో ఆరోగ్యంగా ఉండేదని అన్నారు. కానీ ఎప్పుడైతే ప్లాస్టిక్ వస్తువులను వినియోగించడం ప్రారంభించినప్పటి నుంచి భయంకరమైన రోగాలు రావడం ప్రారంభమయ్యాయన్నారు. ఈ ఏడాది చివరి నాటికి ఉండిని ప్లాస్టిక్ రహితంగా మార్చాలనేదే తమ ఉద్దేశ్యమని ఆయన అన్నారు. ప్రతి ఆదివారం రెండు గంటల పాటు గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తామని అందరినీ ఏకం చేసి ప్లాస్టిక్‌ను నిరోధించేందుకు కృషి చేస్తామన్నారు. అలాగే దుకాణదారులు ప్రజలకు సహకరించాలన్నారు. వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటిస్తూ ప్లాస్టిక్‌కు దూరంగా ఉండాలని కిరణ్‌ప్రసాద్ కోరారు. కార్యక్రమంలో నానిమేడం, వరదరాజు, శ్రీనివాసాచార్యులు, స్వామినాయుడు, పసుపులేటి ప్రసాద్, కాగిత మాతయ్య, ఖండాపు శ్రీను, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను అవమానించిన వారిని శిక్షించాలి

నరసాపురం: అంబేడ్కర్‌ను అవమానించిన దోషులను కఠినంగా శిక్షించాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం దూబచర్ల గ్రామంలో అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసిన ఘటనపై నరసాపురం దళిత సంఘాలు మండిపడ్డాయి. ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో 216 జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ దళితసంఘాల నాయకులు ఇంజేటి జాన్‌కెనడీ, కాకిలేటి ఆనంద్(మధు) మాట్లాడుతూ అంబేడ్కర్‌ను అవమానించడం దారుణమన్నారు. ఘటనకు బాధ్యులైన వారిని గుర్తించి వెంటనే అరెస్ట్ చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత దళితులపై దాడులు పెరిగాయన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

- అధ్వానంగా ఉండి-ఎన్నార్పీ అగ్రహారం సీసీ రోడ్డు
- ఇరిగేషన్ కార్యాలయం వద్ద ప్రమాదకరంగా మారిన రోడ్డు


ఇరిగేషన్ కార్యాలయం వద్ద ప్రమాదకరంగా మారిన సీసీరోడ్డు

ఉండి: స్థానిక సెంటర్ నుంచి పడవల రేవు, తోట ప్రాంతాలతో పాటు ఎన్నార్పీ అగ్రహారం ప్రధాన గ్రామానికి, మహదేవపట్నం గ్రామానికి వెళ్లేందుకు చాలా ఏళ్ళ క్రితం నిర్మించిన సీసీ రోడ్డు క్షీణదశకు చేరుకుంది. రోడ్డు పలు ప్రాంతాల్లో ధ్వంసం కావడంతో పాటు రోడ్డు పగిలిపోయి అధ్వానంగా మారింది. ప్రతి రోజూ వందలాది మంది ప్రయాణించడంతో రద్దీగా ఉండే రోడ్డు గత కొంత కాలంగా ప్రయాణికులకు ప్రమాదకరంగా మారింది. సుమారు 2 కిలోమీటర్ల మేర ఉండే సీసీ రోడ్డును నాటి నర్సాపురం ఎంపీ, కేంద్ర రక్షణశాఖ సహాయ మంత్రిగా పని చేసిన దివంగత యూవీ కృష్ణంరాజు హయాంలో నిధులు కేటాయించగా రోడ్డు నిర్మించారు. ఆయన పూర్వీకులు, మొగల్తూరు మహారాజు అయిన నరసింగరాజు అగ్రహారం గ్రామానికి ఇచ్చిన భూముల వలన ఆయన పేరుతోనే నర్సింగరాజపుర అగ్రహారం (ఎన్నార్పీ అగ్రహారం)అని దానికి పేరు వచ్చింది. దీంతో ఇది గమనించిన కృష్ణంరాజు ఆయన హయాంలో నిధులు కేటాయించి అగ్రహారం గ్రామంతో పాటు ఉండి తోట, పడవల రేవు ప్రాంతాలను అభివృద్ధి చేశారు.

నిత్యం రద్దీగా రహదారి

ముఖ్యంగా ఎన్నార్పీ అగ్రహారం గ్రామంలో వేంచేసియున్న అతిపురాతన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి ఎంతో మంది భక్తులు, ప్రజా ప్రతినిధులు ప్రత్యేకంగా పూజలు చేసేందుకు వస్తుంటారు. దీంతో ఈ రహదారి నిత్యం రద్దీగా ఉంటుంది. అలాగే అగ్రహారంలోని జెడ్పీ హైస్కూల్‌కు వెళ్లే విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని కూడా రోడ్డు నిర్మాణం చేశారు. ఇంత ప్రాముఖ్యమైన రోడ్డు కాలక్రమేణా క్షీణ దశకు చేరుకోవడంతో ఆయా ప్రాంతాల ప్రజలు, వాహనదారులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో పాటు ఉండి ఇరిగేషన్ కార్యాలయం వద్ద వెలివర్రు కాలువపై రోడ్డు పూర్తిగా పాడైపోవడంతో దానిని ఇటుకల రద్దు వేసి పూడ్చారు. అదికాస్త అస్తవ్యస్తంగా మారిపోవడంతో ద్విచక్రవాహనాలు, పాదచారులు వెళ్లేందుకు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు ప్రమాదకరంగా వుండటంతో కొందరు వాహనదారులు ఉండి కాలువలో కూడా పడిపోయినట్లు చెబుతున్నారు. పలు ప్రాంతాల ప్రజలు నిత్యం ఉండికి వస్తుంటారు. అటువంటి అత్యవసరమైన రోడ్డును పాలకులు పట్టించుకోకపోవడం చాలా దారుణమని ప్రయాణికులు, స్థానికులు వాపోతున్నారు. రోడ్డు సుమారుగా కిలోమీటరు మేర ఉండి పంట కాలువ పక్కగా ఉండడంతో సీసీరోడ్డు గుర్తుపట్టలేనంతగా మారిపోయింది.

లిఫ్టు నిర్మాణం వేగవంతం చేయాలి



ఆకివీడు రైల్వే స్టేషన్‌లో నత్తనడకన సాగుతున్న లిఫ్టు నిర్మాణ పనులు

ఆకివీడు: బ్రాంచి రైల్వే లైన్లలో పలు స్టేషన్లలో నిర్మాణం చేపట్టిన లిఫ్టు పనులు నత్తనడకన సాగుతున్నాయి. రెండేళ్లుగా లిఫ్టుల నిర్మాణ పనులు అన్ని స్టేషన్లలో ఇదే తంతులో ఉన్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. నిధులు పుష్కలంగా ఉన్నప్పటికీ లిఫ్టు నిర్మాణాలపై రైల్వే ఇంజనీరింగ్ అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో ఏళ్ల తరబడి నిర్మించేటట్లుగా ఉందని పలువురు ఎద్దేవా చేస్తున్నారు. బ్రాంచి రైల్వే లైన్ డబల్ లైన్, విద్యుదీకరణ చేపట్టడంతో పలు స్టేషన్లలో ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం చేపట్టారు. ఒకటి, రెండు ప్లాట్ ఫాంలకు వెళ్లాలంటే తప్పనిసరిగా వంతెన ఎక్కి వెళ్లాల్సిందే. దీంతో వృద్ధులు, పిల్లలు, మహిళలు వంతెనలు ఎక్కి, దిగలేక అవస్థలు పడుతున్నారు. ప్రయాణాలు చేసి అలసిసొలసిపోయే వారికి వంతెనల బాధ వర్ణనాతీతంగా ఉంది. వంతెనల బెడదను తొలగించేందుకు రైల్వే శాఖ అధికారులు అన్ని స్టేషన్లలో లిఫ్టుల నిర్మాణానికి అనుమతి ఇచ్చారు. రెండేళ్లుగా పలు స్టేషన్లలో లిఫ్టుల నిర్మాణం మందకొడిగా సాగుతుంది. పునాదుల, పిల్లర్లు, శ్లాబ్‌ల దశలోనే ఆగిపోయాయి. ఎప్పుడు లిఫ్టులు అమర్చుతారని ప్రయాణికులు ఎదురు చేస్తున్నారు. లిఫ్టు సౌకర్యాన్ని వేగవంతం చేసేందుకు ఈ ప్రాంతంలోని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ చొరవ చూపాలని పలువురు కోరుతున్నారు.

విప్లవ వీరులకు ఘన నివాళి


భీమవరం: విప్లవ వీరులకు నివాళులర్పిస్తున్న నాయకులు



ఉండి: భగత్‌సింగ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సర్పంచ్, ఎస్ఎఫ్ఐ నాయకులు


ఆకివీడు: కాగడాల ప్రదర్శన చేస్తున్న యువకులు


భీమవరం అర్బన్: భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నేతలు

భీమవరం: స్వాతంత్ర్య సమరయోధులు, విప్లవ వీరులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 94వ వర్ధంతి సందర్భంగా సీపీఎం జిల్లా కార్యాలయంలో వారి చిత్ర పటానికి మంతెన సీతారాం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంతెన సీతారాం మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం అతిచిన్న వయసులోనే ఉరికంభం ఎక్కిన భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల త్యాగం మరువలేనిదని కొనియాడారు.అదే విధంగా టౌన్ సీపీఐ ఆధ్వర్యంలోనూ, విజ్ఞాన వేదిక సేవా సంస్థ ఆధ్వర్యంలో విప్లవ వీరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో బి.బలరాం, జేఎన్‌వీ గోపాలన్, చింతకాయల బాబూరావు, కేతా గోపాలన్, బి.వాసుదేవరావు, కొరు పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఏ ఆధ్వర్యంలో..

దేశ స్వాతంత్ర్య పోరాటంలో భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల త్యాగాలు మరువలేనివని వీరి స్ఫూర్తితో విద్యార్థులు యువత నిరుద్యోగ సమస్యపై పోరు కొనసాగించాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్ఏ) జిల్లా కార్యదర్శి టి.అప్పలస్వామి పిలుపునిచ్చారు. ఆదివారం ఏఐఎస్ఏ ఆధ్వర్యంలో విప్లవ వీరులకు ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో, సీహెచ్ అమృత, జి.శాంతకుమారి, పి.తవిత, జె.జోష్, కె.నికిల్, జి.దినేష్, తదితరులు పాల్గొన్నారు.

పోరాట యోధుడు భగత్‌సింగ్

ఉండి: పోరాట యోధుడు భగత్‌సింగ్ 94వ వర్ధంతిని మండలంలోని పాందువ్వ గ్రామంలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ మండల కార్యదర్శి మాదాసి గోపీ మాట్లాడుతూ బ్రిటీష్ సామ్రాజ్యవాదుల నుంచి భరతమాతకు స్వేచ్ఛా వాయువులు ఊదిన భరతమాత ముద్దుబిడ్డ భగత్‌సింగ్ అన్నారు. భగత్‌సింగ్ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహాన్ని సర్పంచ్ సాంబశివరావు, ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ భగత్ సింగ్ ఓ అద్భుతమైన వ్యక్తి అని అన్నారు. కార్యక్రమంలో ఎస్ గంగయ్య,ఎం మహేంద్ర,ఎం బుజ్జి,ఎం దుర్గాప్రసాద్,ఎస్ బాలాజీ,ఏసోబు,కళ్యాణ్,బాబీ, ఎం.బోసు, టి.ప్రసాద్, జి.శ్రీనివాస్, కె.రోహిత్, కె.గోవింద్, సీహెచ్ సతీష్, ఎం.రమాదేవి, సూర్యప్రకాష్, శేషు, డి.శ్రీను, మురళీ, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని అందరూ కాపాడాలి

భీమవరం అర్బన్: భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని పాలకులు తూట్లు పొడుస్తున్నారని దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సీపీఐ మండల కార్యదర్శి ఎం.సీతారామ్ ప్రసాద్ అన్నారు. భీమవరం మండలంలోని నాగేంద్రపురం గ్రామంలో ఆదివారం ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి ఎమ్ సీతారామ్ ప్రసాద్ మాట్లాడుతూ విప్లవ వీరుడు సర్దార్ భగత్ సింగ్ దేశం కోసం చిన్న వయస్సులోనే తృణప్రాయంగా ప్రాణాలర్పించారన్నారు. అన్ని వర్గాల వారికి ఆమోదయోగ్యంగా రచించిన భారత రాజ్యాంగాన్ని నేటి పాలకులు తూట్లు పొడిచి కార్పొరేట్ శక్తులను పెంచి పోషిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు, మహిళలకు రక్షణ లేకుండా పోయిందని లౌకిక దేశాన్ని మతోన్మాద దేశంగా మార్చడానికి బీజేపీ నాయకులు ఆర్ఎస్ఎస్ అజెండాతో పని చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా నాట్య మండలి నాయకులు ఛాంద్‌భాషా మాట్లాడుతూ భగత్‌సింగ్ దేశం కోసం ఎంతో కష్టపడ్డారని చిన్న వయసులోనే పోరాటంలోకి వచ్చారంటే ఆయన త్యాగనిరతికి విప్లవ జోహార్లన్నారు. కార్యక్రమంలో నాగిడి తులసీరావు, తిరుమాని చంటి రాజు, నాగిడి ఆంజనేయులు, గాడి వెంకటేశ్వర్లు, తిరుమాని నాగరాజు, పిల్లి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కాగడాల ప్రదర్శన

ఆకివీడు: దేశ సమైక్యత కోసం యువత ముందుకు రావాలని డీవైఎఫ్ఐ మండల అధ్యక్ష కార్యదర్శులు డి.రవితేజ బి.రాంబాబు పిలుపునిచ్చారు. భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా ఆదివారం సెంటర్‌లో కాగడాల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భగత్‌సింగ్ ఆశయ సాధనలో భాగంగా దేశ సమగ్రత లక్ష్యంగా యువత నడుం బిగించాలని పిలుపునిచ్చారు. నిరుద్యోగ సమస్య పరిష్కారంలోనూ, యువ శక్తిని సద్వినియోగం చేసుకోవడంలో నేటి పాలకులు విఫలమయ్యారని ఆరోపించారు. కార్యక్రమంలో వెంకటేష్, అప్పారావు, ఆర్.ప్రసాద్, పెంకి అప్పారావు, సతీష్, కె.తవిటి నాయుడు, బీవీ వర్మ, తదితరులు పాల్గొన్నారు.